సాక్షి
తిరుపతి
గురువారం, 4 ఏప్రిల్, 2024

సదుం రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పక్కన మంత్రి పెద్దిరెడ్డి



పూతలపట్టులో అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



మండుటెండ..

నువ్వే గుండె నిండా!

ఉమ్మడి చిత్తూరు జిల్లా మురిసిపోయింది. ప్రచండ భానుని ఎదురొడ్డి అభిమాన కెరటం ఉవ్వెత్తున ఎగసిపడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. జగనన్న జైత్రయాత్రకు ఊరూవాడా కదిలివచ్చింది. దారిపొడవునా హారతులు పట్టి.. పూల వర్షం కురిపించి ఆనందోత్సాహాలను చాటుకుంది. 'నువ్వే కావాలి.. మళ్లీ నువ్వేరావాలి' అంటూ ఉద్వేగంతో నినదించింది. కుట్రల కూటమిని ఓడించేందుకు 'మేమంతా సిద్ధం' అంటూ ప్రతినబూనింది. సంక్షేమ సారథితో సెల్ఫీలు దిగేందుకు యువత పోటీపడింది. జగన్ మామను చూడాలని విద్యార్థి లోకం మేడలెక్కగా.. మనవడిని మనసారా ఆశీర్వదించేందుకు తరలివచ్చిన పండుటాకులను చూసి జన హృదయం ఉప్పొంగింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బస్సు యాత్ర జిల్లాలో మొదటి రోజు ఆద్యంతం అశేష జనసందోహం నడుమ కొనసాగింది.



అభ్యర్థులు కృపాలక్ష్మి, విజయానందరెడ్డి, సునీల్‌కుమార్, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, వెంకటేగౌడ, భరత్, రెడ్డెప్ప, ఆర్‌కే రోజాను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్రకు పోటెత్తిన జనం

- అడుగడుగునా అపూర్వ స్వాగతం
- అశేష జనసందోహానికి ముఖ్యమంత్రి అభివాదం
- మహిళలు, యువతకు ఆత్మీయ పలకరింపు

సాక్షి, చిత్తూరు : ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రోడ్‌షో ఆద్యంతం జనసంద్రాన్ని తలపించింది. ముందుగా బుధవారం ఉదయం సదుం మండలం అమ్మగారి పల్లె నుంచి బస్సు యాత్ర మొదలైంది. జాండ్రపేట , సదుం, బట్టువారిపల్లె, ఎరుకులపురం, గొడ్లవారిపల్లె, బూరగమంద క్రాస్, పులిచెర్ల మండలంలోని శ్రీనివాసపురం, చల్లావారి పల్లి, కల్లూరు వరకు కొనసాగింది. అనంతరం చంద్రగిరి నియోజకవర్గం దామలచెరువు మీదుగా పూతలపట్టు నియోజకవర్గంపాలకల సంతగేటి, తలుపులపల్లె, తేనెపల్లెకు చేరుకుంది. మధ్యాహ్న భోజన విరామం తర్వాత రంగంపేటక్రాస్ మీదుగా సీఎం వైస్ జగన్ బస్సు యాత్ర బహిరంగ సభామైదానంలోకి ప్రవేశించింది. సభ అనంతరం రాత్రి 7 గంటలకు ముఖ్యమంత్రి రోడ్ షో రంగంపేట క్రాస్ మీదుగా తిరుపతి జిల్లాకు చేరుకుంది.

సదుం, కల్లూరు, దామలచెరువులో జన సమ్మోహనం

పుంగనూరు నియోజవర్గం సదుం, కల్లూరు తోపాటు చంద్రగిరి నియోజక వర్గం దామలచెరువులో సీఎం జగన్ రోడ్ షో అద్భుతంగా సాగింది. మండుటెండనూ లెక్క చేయకుండా జనం వేలాదిగా తరలివచ్చారు. మిట్ట మధ్యాహ్నం సుమారు 43 నుంచి 44 డిగ్రీల ఎండ తీవ్రత ఉన్నా ప్రజలు నిరీక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సైతం ప్రజలకు అభివాదం చేస్తూ ఆత్మీయంగా పలకరించారు. ఈ క్రమంలో రోడ్డుకు ఇరువైపులా మిద్దెలపై నుంచి జనం పూల వర్షం కురిపించారు.

అవ్వకు అభయం!

సదుం మండలం గొడ్లవారి పల్లికి చెందిన సల్లాపు రమ్మ అనే వృద్ధురాలి సమస్య పరిష్కరిస్తామని సీఎం జగన్ భరోసా ఇచ్చారు. బస్సు దగ్గరకు వచ్చిన వృద్ధురాలిని గమనించి ముఖ్యమంత్రి తానే కిందకు దిగి వచ్చి పలకరించారు. ఈ సందర్భంగా వృద్ధురాలు మాట్లాడుతూ తనకు కిడ్నీ ఆపరేషన్ జరిగిందని, చేతివేళ్లు లేవని, ఎలాంటి ఆధారం లేదని, రూ.3వేల పింఛన్ సరిపోవడం లేదని విన్నవించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి ఆమెను అక్కున చేర్చుకుని అండగా ఉంటామన్నారు.

సర్పంచ్‌తో మాటామంతీ..

సదుం మండలం ఎర్రాతివారిపల్లె సర్పంచ్ కళావతితో సీఎం జగన్ ముచ్చటించారు. ప్రభుత్వం అందించే పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా.? అంటూ ఆరా తీశారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా సంక్షేమ ఫలాలు పేదలకు చేరుతున్నాయని, జనం సంతోషంగా ఉన్నారని సర్పంచ్ బదులివ్వడంతో ముఖ్యమంత్రి చిరునవ్వులు చిందించారు.

భారీగా బైక్ ర్యాలీ

రంగంపేట క్రాస్ వద్ద చిత్తూరు జిల్లా యూత్ వింగ్ ఆధ్వర్యంలో వందలాది మంది యువకులు భారీగా బైక్ ర్యాలీ చేపట్టారు.

ముస్లింలకు అండగా ఉంటాం..

సదుంలో రోడ్ షో సందర్భంగా ముఖ్యమంత్రిని పెద్దసంఖ్యలో ముస్లింలు కలిశారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు మద్దతు ఇవ్వవద్దని విన్నవించారు. దీనిపై సీఎం జగన్ సానుకూలంగా స్పందించారు. ముస్లింలకు అండగా ఉంటామని, వారిని ఇబ్బంది పెట్టే ఎలాంటి చట్టాలకు వైఎస్సార్‌సీపీ మద్దతు ఇవ్వదని స్పష్టం చేశారు.





దామలచెరువులో భారీ క్రేన్‌లతో గజమాలలు వేసి సీఎం వైఎస్ జగన్‌కు అపూర్వ స్వాగతం (ఇన్‌సెట్) ముఖ్యమంత్రితో కలిసి ప్రజలకు అభివాదం చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి

ఏమి జనాలబ్బా సామీ!

పలమనేరు : జగన్ మీటింగ్ యాడ జరిగినా ఏమి జనాలబ్బా సామీ..నా కేమీ అర్థం కాలేదు. మొన్న చంద్రబాబు వచ్చిన పొద్దు నువ్వేమో టీడీపీ వస్తాది అని చెబ్తివి.. కానీ, జగన్ మీటింగ్‌లకు పోతున్న జనాన్ని చూస్తాంటే నా బుర్ర పనిచేయలేప్పా.. అన్నాడు మొగిలప్ప పక్కనే ఉన్న రాజప్పతో. ఇది పలమనేరు టమాట మార్కెట్‌కు వచ్చిన ఇద్దరు రైతుల సంభాషణ.

రాజప్ప : ఈ టీడీపీవాళ్లేమో నేను కనిపించినప్పుడల్లా టీ తాగమని తీసిచ్చి ఎట్లా ఉందప్పా మన ఊర్లో మూమెంట్ అనేవారు. జనం మనసులో ఏముందో ఎట్టా తెలుస్తుందన్నా అంటే.. నువ్వు ఏడుండావు మా టీడీపీనే వచ్చేదని చెప్పిరి. నిజమేనేమో అనుకుని నీకు చెప్పినా.

మొగిలప్ప : టీడీపీవోళ్లు కాబట్టే అలా చెబ్తారు. నీ తెలివి ఏమైందిరా అక్కమ్మా. దినామూ మార్కెట్‌కొస్తా ఉంటావు. జనం మదిలో ఏముందో తెలుసుకోవద్దా. మంగళారం మదనపల్లెలో చూస్తివా, బుధారం పూతలపట్టులో సూస్తివా జనాలు ఎట్టా వచ్చారో.

ఇంతలో అక్కడికి చేరిన రైతులు : నాలుగేళ్ల పాటు మేలు చేసిన జగన్‌కే ఓటేయాలని జనం మనసుల్లో ఎప్పుడో పెట్టుకున్నార్రా సామి. మా ఊర్లో ఆడోళ్లు, ముసలోళ్లు ఎవరినడిగినా ఫ్యాన్‌కేనంటా ఉండారు.



అన్న కరచాలనంతో అక్కచెల్లెమ్మల ఆనందం



వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరం



దీనజన బాంధవుడికి దిష్టి పోవాలంటూ..

ఓ తల్లికి భరోసా



రొంపిచెర్ల: నారాయణ కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా తమ బిడ్డ మృతి చెందాడని.. తమకు న్యాయం చేయాలని అబ్దుల్ నబీ, షాహీరా దంపతులు ముఖ్యమంత్రికి విన్నవించారు. సదుం మండలంలోని అమ్మవారిపల్లెలో ఈ మేరకు ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేశారు. తిరుపతి వద్ద శ్రీనివాస మంగాపురం సమీపంలోని నారాయణ కాలేజీలో తమ కుమారుడు "అయ్యా, మా రెండో కుమారుడు అబ్దుల్ నజీర్ (17) ఇంటర్ చదివేవాడన్నారు. 2021 ఫిబ్రవరి 21న కళాశాలలో కళ్లు తిరిగి కింద పడితే వెంటనే ఆస్పత్రికి తరలించలేదని, దీంతో తమ బిడ్డ మరణించాడని వివరించారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లి ఉంటే తమ కుమారుడు బతికేవాడని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణ కాలేజీ వారు తమ పైనే కేసులు పెడతామని బెదిరించారని పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పందించారు. కేసును రీఓపెన్ చేయించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

జేసీబీలతో పూలవర్షం

సీఎం జగన్ బస్సు యాత్ర పూతలపట్టు నియోజవర్గంలోకి ప్రవేశించగానే పెద్దసంఖ్యలో ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పాలకల సంద గేటు వద్ద 10 జేసీబీలపై నుంచి పూలవర్షం కురిపించారు.

అన్నీ తామై..

సీఎం జగన్ బస్సు యాత్రను సూపర్ సక్సెస్ చేయడంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విశేషంగా కృషి చేశారు. యాత్రలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థులు మంత్రి రోజా, భరత్, విజయానందరెడ్డి, వెంకటేగౌడ, సునీల్ కుమార్, కృపాలక్ష్మి శ్రమించారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

సదుం మండలం అమ్మగారి పల్లె బేస్ క్యాంపు వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ కుమారుడు హరికృష్ణ వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే మాజీ జెడ్పీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి , కుప్పానికి చెందిన టీడీపీ నేతలు కృష్ణమూర్తి, బీతప్ప పార్టీలో చేరారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో తేనెపల్లె వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పలమనేరు టీడీపీ మాజీ ఎమ్మెల్యే లలితా కుమారి వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్ పాల్గొన్నారు.

చంద్రగిరి..అభిమాన సిరి

తిరుపతి రూరల్/పాకాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు నీరాజనాలు పట్టారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలాది మంది అపూర్వ స్వాగతం పలికారు. సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్ర పాకాల మండలం పదిపట్లబైలు నుంచి దామలచెరువు మీదుగా పూతలపట్టు నియోజకవర్గంలోకి ప్రవేశించేవరకు దాదాపు 10 కిలోమీటర్ల మేర రోడ్లకు ఇరువైపులా జనం బారులతీరారు.

సంప్రదాయబద్ధంగా స్వాగతం

పదిపట్లబైలు గ్రామానికి బస్సు యాత్ర చేరుకోగానే 61 మంది కళాకారులు మంగళ వాయిద్యాలతో సంప్రదాయబద్ధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికారు. 1001 మంది మహిళలు గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. దామలచెరువు వద్ద 45 భారీ క్రేన్‌లతో 45 గజ మాలలను సీఎం జగన్‌కు వేసి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

10 వేల మందికి భోజనాలు

సిద్ధం బస్సు యాత్రకు దాదాపు 10 వేల మందికి పైగా తరలివచ్చారు. వారందరికీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి భోజన ఏర్పాట్లు చేశారు.

ఆప్యాయంగా పలకరించి..

మోహిత్‌రెడ్డితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆత్మీయంగా మాట్లాడారు. బాగున్నావా మోహిత్ అని ఆప్యాయంగా పలకరించారు.



దామలచెరువు వద్ద సీఎం జగన్‌కు దిష్టితీస్తున్న మహిళలు



మహానేతకు జననేత నివాళి



చంద్రగిరి నియోజకవర్గం తనపల్లి క్రాస్ వద్ద స్వాగతం పలుకుతున్న అభిమానులు

క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 56,228 మంది స్వామివారిని దర్శించుకోగా 18,886 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.4.04 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం పూర్తవుతోంది.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సమ్మర్ క్యాంపులో భాగంగా జాబ్ ఓరియంటెడ్ కంప్యూటర్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ద్వారకనాథరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో కంప్యూటర్ ఫండమెంటల్స్, ఆఫీసర్ ఆటోమేషన్(ఎంఎస్–ఆఫీస్), డీటీపీ, ట్యాలీ ఈఆర్పీ 9.3వి, సీ, సీ++, వీబీ అండ్ ఒరాకిల్, జావా, జే2ఈఈ, హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్, మొబైల్ టెక్నాలజీ, ఆటోక్యాడ్, మల్టీమీడియా, పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ మల్టీమీడియా అండ్ యానిమేషన్, పీసీ–మెయింటెన్స్, వెబ్ డిజైనింగ్, జూనియర్ అనిమేటర్ (14ఏళ్లలోపు ఉన్న వారికి) కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని 7వ తరగతి ఆపై విద్యార్హత ఉన్న విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, గృహిణులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని మైక్రో ప్రాసెసర్ అండ్ నెట్‌వర్కింగ్ ల్యాబ్‌లో నేరుగా, అలాగే 99851 29995, 76718 87039 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పండుటాకుల విలవిల

"చంద్రబాబు ఇది నీకు తగునా.. కాళ్లు చేతులు లేక మంచాన పడిన మా ముసలివాళ్లపై, కళ్లు కనిపించిన మాలాంటి అవిటివాళ్లపైనా నా నీ రాజకీయం.. ఖర్మ కొద్దీ దివ్యాంగులమైన మాపైన నీకు కాసింత అయినా జాలి లేదా ? మాలాంటి వారిపై రాజకీయాలు చేయడం మంచి పద్ధతేనా"? అంటూ సచివాలయాల వద్ద వృద్ధులు, దివ్యాంగుల నోటి నుంచి వచ్చిన మాటలు. ఎండలో నిలబడలేక కొందరు వృద్ధులు గుండెలవిసేలా ఆర్తనాదాలు పెట్టడం కలిచివేసింది. చంద్రబాబు తీరుపై పింఛన్‌దారులు పెద్దఎత్తున మండిపడుతున్నారు.

- పింఛన్ తీసుకోవడానికి వచ్చి ఇద్దరు వృద్ధుల మృతి
- మండుటెండలో సచివాలయాల వద్ద వృద్ధులు, దివ్యాంగుల పడిగాపులు
- పింఛనో దేవుడా అంటూ ఆర్తనాదాలు
- చంద్రబాబుకు మా ఉసురు తప్పదంటూ శాపనార్థాలు
- తడ, డక్కిలి మండలాల్లో ఆలస్యంగా పంపిణీ
- జిల్లావ్యాప్తంగా పింఛన్ కోసం వేలాది మంది ఎదురుచూపులు


తిరుపతి పట్టణంలోని ఓ సచివాలయానికి నడవలేని స్థితిలో ఆటోలో వచ్చిన వృద్ధురాలిని దింపుతున్న సహాయకురాలు



ప్రాణాలు కోల్పోయిన లలితమ్మ, నన్నే సాహెబ్

తిరుపతి అర్బన్: జిల్లావ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదు అవుతున్నాయి. మరోవైపు వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకూడదని టీడీపీ అధినేత చంద్రబాబు తన అనుయాయుల ద్వారా ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో తాత్కాలికంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. అయితే సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేయాలన్న ఆదేశాలు రావడంతో బుధవారం జిల్లావ్యాప్తంగా సచివాలయాల వద్ద పింఛన్ పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో పింఛన్ తీసుకోవడానికి వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు, సచివాలయాల వద్ద మండుటెండలో పడిగాపులు కాశారు.

పింఛన్ కోసం వచ్చి ఇద్దరు మృతి..

ఈ క్రమంలో చంద్రగిరి నియోజకవర్గం ఎర్రావారిపాళెం మండలం నెరబైలు సచివాలయం వద్ద నన్నే సాహెబ్ అనే వృద్ధుడు పింఛన్ కోసం వెళ్లి మృతి చెందాడు. సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని సాయినగర్‌కు చెందిన ఈశ్వరవాక లలితమ్మ(58) పింఛన్ కోసం సచివాలయం సమీపంలోని స్త్రీశక్తి భవనం వద్దకు వెళ్లింది. అక్కడ మధ్యాహ్నం వరకు ఎండలో ఉండడంతో వేడిమి తట్టుకోలేక స్పృహ కోల్పోయింది. మున్సిపల్ సిబ్బంది ఆమెను వెంటనే సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించినప్పటికీ ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జిల్లావ్యాప్తంగా కూడా చాలాచోట్ల ఎండలకు క్యూలైన్‌లో వృద్ధులు నిలబడలేక నానా తిప్పలు పడ్డారు. పింఛనో దేవుడా అంటూ వృద్ధుల ఆర్తనాదాలు మిన్నంటాయి. టీడీపీ నేత చంద్రబాబు నాయుడు వలంటీర్లను తప్పించడంతోనే తమకు తిప్పలు వచ్చాయని, మా ఉసురు చంద్రబాబుకు తప్పదంటూ శాపనార్థాలు పెట్టారు.

తొలిరోజే 1,16,958 మందికి పంపిణీ

తొలిరోజు 2,71,477 మందికి గాను 1,16,958 మందికి పింఛన్ పంపిణీ చేశారు. తడ, డక్కిలి మండలాల్లో ఆలస్యంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. తడ మండలంలో 6055 మందికి కేవలం 562 మందికి, డక్కిలి మండలంలో 6503 మందికి గాను 759 మందికి, ఓజిలి మండలంలో 5668 మందికి గానూ 899 మందికి మాత్రమే పంపిణీ చేశారు. మొత్తంగా 43.08 శాతం మాత్రమే పంపిణీ చేశారు. గతంలో వలంటీర్లు తొలిరోజే 98 శాతం పింఛన్లు పంపిణీ చేసేవారు.

సొంతబిడ్డలా చూస్తాండ్రి..


ఎల్లమ్మ, శ్రీకాళహస్తి

వలంటీర్ నన్ను నా సొంతబిడ్డల్లా చూసేవారు. మా ఇంటికి నెల తొలి రోజే వచ్చి పింఛను ఇస్తాండె. నారా చంద్రబాబునాయుడు చేసిన పనికి వలంటీరు ఈ నెల ఇంటికి వచ్చి పింఛను ఇవ్వలేను అవ్వ అన్నారు. మూడు నెలలుగా బాత్‌రూమ్‌లో కాలుజారి పడి ఇంట్లో నడవలేని పరిస్థితిలో ఉన్నాను. నా అనేవారు ఎప్పుడో వచ్చి చూసిపోతారు. మాత్రలు, మందులు, తిండికి పింఛను మీదే ఆధారపడ్డాను. వలంటీర్ పింఛను ఇచ్చాక, మందులు కావాలన్నా తెచ్చిస్తా ఉండె. చంద్రబాబు పుణ్యమా అని మాకు ఈ గోడు వచ్చింది. కుంటుకుంటూ సచివాలయం వద్దకు వచ్చాను.

బాబుకు మా ఉసురు తగులుంది



నాపేరు ఈశ్వరమ్మ. నా వయస్సు 81 ఏండ్లు. ఊత కర్రపై కూడా నడవలేని పరిస్థితి. ఇన్నాళ్లు వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి పింఛన్ ఇచ్చేది. చంద్రబాబునాయుడు వలంటీర్లను పెన్షన్ అందించకుండా అడ్డుకున్నారని తెలిసింది. చంద్రబాబు మా ఉసురు కొట్టుకుని పోతాడు.
– ఈశ్వరమ్మ, వృద్ధురాలు, అంజిమేడు, ఏర్పేడు మండలం

మా కడుపు కొడుతున్నారు



ఇన్నాళ్లూ ఒకటో తేదీనే ఉదయం 5 గంటలకు ఇంటికి వచ్చి వలంటీర్లు పెన్షన్ ఇచ్చే వాళ్లు. ఈ నెల నుంచి వలంటీర్లు పింఛన్ ఇవ్వడానికి వీల్లేదని, చంద్రబాబే దీనికి కారణమని చెబుతున్నారు. మాలాంటి వృద్ధుల కడుపుకొడితే టీడీపీ మట్టి కొట్టుకుపోతుంది.
– అంకయ్య, పోతుమానిగుంట ఎస్టీ కాలనీ, ఏర్పేడు మండలం

పాత రోజులు గుర్తొస్తున్నాయ్



నా వయసు 79. వృద్ధాప్యం మీద పడింది. అనారోగ్య కారణాలతో కాళ్ల నొప్పులు. మనిషి లేనిదే కాసింత దూరం కూడా నడవలేను. అలాంటిది 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న సచివాలయానికి ఎలా వెళ్లాలి ? కనీసం ద్విచక్ర వాహనంపైన ఎక్కి కూర్చోవాలన్న ఇబ్బందే. ఇద్దరు మనుషుల సాయంతో బైక్‌పై వచ్చి రెండు గంటల పాటు క్యూలో నిలబడి పింఛన్ తీసుకున్నాను. ఇంతటి పరిస్థితికి కారకులైన వారికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతాం. **-బుజ్జమ్మ, కుప్పటతాగేలి, వరదయ్యపాళెం మండలం**

ముసలోళ్లపై ఈ కక్ష ఏంది ?


మంగమ్మ, శ్రీకాళహస్తి

వలంటీర్లు ప్రతి నెల 1వ తేదీన పింఛను మా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవారు. కృష్ణా.. రామా అనుకుంటూ మంచం మీద కాలం గడుపుతున్నా. నా కాళ్ల నొప్పులకు మందులు తెచ్చుకుని జీవనం సాగిస్తున్నా. కానీ చంద్రబాబునాయుడు పార్టీవారే ఏదో చేయడంతో వలంటీర్ మా ఇంటికి రాలేదు. మాపై ఏందయ్యా ఈ కక్ష. రాజకీయాలకు మేము అడ్డు వచ్చామా ? ఇంత కాళ్ల నొప్పులు ఉన్నా, సచివాలయానికి వచ్చాను.

అలిసిపోయి చెట్టు కింద..


చిల్లకూరు: పింఛన్ కోసం వచ్చి అలిసిపోయిన వెంకటసుబ్బయ్య

ఈయన పేరు తుపాకుల వెంకటసుబ్బయ్య ఈయనకు వినికిడి లోపం. అలాగే గుండె జబ్బు ఉంది. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ సొమ్ముతో మందులు కొనుగోలు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అయితే ఈ నెల వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి పింఛన్ ఇవ్వరని చెప్పడంతో మరి కొంతమంది పింఛన్‌దారులతో కలసి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న చేడిమాల సచివాలయం వద్దకు ఉదయమే వచ్చాడు. అయితే సాయంత్రం పింఛన్ ఇస్తారనడంతో తిరిగి ఇంటికి వెళ్ల లేక సచివాలయం వద్ద ఉన్న చెట్టు కింద ఇలా పడుకుండిపోయాడు. ఆయనను పలుకరించగా ''ఇంత కష్టం మాకు ఎందుకయ్యా.. సీఎం జగన్ ఇంటి వద్దకే వలంటీర్లతో పింఛన్ పంపించేవాడు. ఈ చంద్రబాబు ఎందుకు ఇలా చేస్తున్నాడో తెలియడం లేదు. ఆయనకు మా ఉసురు తగులుతుంది'' అన్నాడు.

కురుబ కులస్తులను ఆదుకుంటాం


కల్లూరులో సీఎం జగన్‌ను సన్మానిస్తున్న కురుబ సంఘం నాయకులు

పులిచెర్ల(కల్లూరు): కురుబలను అన్నివిధాలా ఆదుకుంటామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కురుబ కులస్తులకు భరోసా ఇచ్చారు. కల్లూరులో బుధవారం పుంగనూరు నియోజకవర్గ కురుబ కులస్తుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కురుబ కులస్తులు మాట్లాడుతూ తమను అన్ని విధాలా ఆదుకుంటున్న సీఎం జగన్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. వచ్చే ఎన్నికల్లో కురుబలు వైఎస్సార్‌సీపీకి అండగా ఉండి తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిని చేస్తామన్నారు. అనంతరం కురుబ నాయకులు కె.జి.కృష్ణమూర్తి, జబ్బాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో కురుబ సంఘం నాయకులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, మంత్రి రోజా, జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

జననేతకు స్వాగతం పలికేందుకు 'మేమంతా సిద్ధం'

- మిట్టకండ్రిగ నుంచి పదివేల మోటార్ సైకిళ్లతో ర్యాలీ

శ్రీకాళహస్తి: నాయుడుపేటలో గురువారం జరిగే మేమంతా సిద్ధం సభకు శ్రీకాళహస్తి మీదుగా వెళ్లనున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను పురస్కరించుకుని స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. రేణిగుంట మండలం గురవరాజుపల్లెలో బుధవారం రాత్రి ముఖ్యమంత్రి బస చేయనున్నారు. గురువారం ఉదయం అక్కడి నుంచి బస్సు యాత్ర మల్లవరం, ఏర్పేడు, చల్లపాళెం, రాచగున్నేరి మీదుగా పట్టణ సరిహద్దులోని మిట్టకండ్రిగ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి ఏపీ సీడ్స్ సర్కిల్ వరకు పదివేల మోటార్ సైకిళ్లతో ర్యాలీగా స్వాగతం పలకాలని ప్రణాళిక రూపొందించారు. ఏపీ సీడ్స్ సర్కిల్ వద్ద ప్రజలకు ముఖ్యమంత్రి అభివాదం చేసి బైపాస్ రోడ్డు మీదుగా తొట్టంబేడు మండలం కన్నలికి చేరుకుంటారు. అక్కడ అరగంట పాటు ఆటోడ్రైవర్లతో సమావేశం కానున్నారు. పొయ్య గ్రామంలో రోడ్‌షోలో పాల్గొననున్నారు. అక్కడి ఏర్పాట్లను ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం నాయుడుపేటలో జరిగే మేమంతా సిద్ధం సభకు శ్రీకాళహస్తి నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలి వెళ్లనున్నారు.

వైభవంగా సుగుటూరు గంగ జాతర



అమ్మవారి సన్నిధిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, హాజరైన జనసందోహం(ఇన్‌సెట్) విశేషాలంకరణలో సుగుటూరు గంగమ్మ

– నిమజ్జనంతో ముగిసిన సంబరం

పుంగనూరు : జమీందారుల కుల దైవం సుగుటూరు గంగమ్మ జాతర సందర్భంగా రెండో రోజు బుధవారం అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు. తొలి, మలి పూజలు జమీందారులు నిర్వహించగా బెస్తవారు, యాదవ కులస్తులు, తోటి కులస్తులచే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సుగుటూరు గంగమ్మను , విరూపాక్షి మారెమ్మను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులను గెరిగెలతో ఆలయంలో మూడు ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

విశేష పూజలు : పట్టణంలోని విరూపాక్షి మారెమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు. అలాగే బజారువీధిలో నడివీధి గంగమ్మ , తూర్పు మొగసాలలో గంగమ్మ , బాలాజి థియేటర్ వద్ద మలారమ్మ గంగమ్మ, మైసూర్ బ్యాంకు వద్ద నలగంగమ్మ, బస్టాండులో విరూపాక్షి మారెమ్మ, నల్లరాళ్లపల్లె వద్ద నలగంగమ్మ , కోనేరు వద్ద బోయకొండ గంగమ్మ, నానాసాహెబ్‌పేటలోని నడివీధి గంగమ్మలను ఉంచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

పోటెత్తిన భక్తులు : సుగుటూరు గంగమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. పురపాలక కమిషనర్ ఆధ్వర్యంలో భక్తులకు పకడ్బందీగా మౌలిక వసతుల కల్పించారు.

శాస్త్రోక్తంగా నిమజ్జనం : సుగుటూరు గంగమ్మ జాతర బుధవారం అర్ధరాత్రి ముగిసింది. అమ్మవారికి జమీందారులు మలి పూజలు నిర్వహించారు. రాత్రి పట్టణ పురవీధులలో ఊరేగింపు నిర్వహించి, గురువారం వేకువజామున శాస్త్రోక్తంగా నిమజ్జనం చేశారు. అనంతరం అమ్మవారిని విగ్రహాలను జమీందారులకు అప్పగించారు.

బంగారు చీరలో పోలేరమ్మ కటాక్షం

- భక్తులతో నిండిన ఆలయం


పోలేరమ్మను తలపై మోస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి

చిల్లకూరు: అమ్మలుగన్నా అమ్మగా ఉన్న తీర ప్రాంతంలోని తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో జరిగే జాతరకు బుధవారం ఎక్కడ చూసినా భక్తుల రద్దీ కనిపించింది. అన్నిమార్గాల నుంచి భక్తులు తూర్పు కనుపూరుకు భక్తులతో తరలివస్తున్నారు. ఓవైపు ముత్యాలమ్మ ఆలయంలో సర్వదర్శనంతో పాటు ప్రత్యేక క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఆలయం వెనుక తమ మొక్కులు చెల్లించడంలో భాగంగా వెయ్యి కళ్ల దుత్తలను పగులకొట్టి, గుడిపై కోడి పిల్లలు, ధాన్యం, ఉల్లిపాయలు వేశారు. పోలేరమ్మ గుడిపై మహిళలు బెల్లం, కుడుములు విసిరి మొక్కుకున్నారు. కొంతమంది భక్తులు దున్నలను అమ్మవారికి కానుకగా సమర్పించుకున్నారు. పోలేరమ్మ అమ్మవారిని గణాచారి ప్రత్యేక పూజలు చేసి నిలబెట్టారు. ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు తాగునీరు, అంబలి, మజ్జిగ ప్యాకెట్లను ప్రసాదాలను దాతల సహకారంతో అందజేశారు.

పేర్నాటి ప్రత్యేక పూజలు..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ఎన్నికల్లో ఘన విజయం సాధించి రెండవసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలని కోరుతూ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పోలేరమ్మ విగ్రహాన్ని తలపై పెట్టుకుని కొద్దిసేపు మోసి అమ్మవారికి మొక్కులు మొక్కుకున్నారు.

ముత్యాలమ్మకు జ్ఞాన ప్రసూనాంబ సారె

జాతర సందర్భంగా ముత్యాలమ్మకు శ్రీకాళహస్తిలో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ, శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం పాలక మండలి చైర్మన్ తారక శ్రీనివాసులు ముత్యాలమ్మకు బుధవారం జ్ఞాన ప్రసూనంబ అమ్మవారి తరఫున సారెను సమర్పించారు.


ముత్యాలమ్మకు సారె సమర్పిస్తున్న తారక శ్రీనివాసులు


ముత్యాలమ్మకు పూజలు నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులతో పేర్నాటి

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని మూర్తిరెడ్డిపాళెం గ్రామ సమీపంలో స్వర్ణముఖి నది నీటి గుంతలో పడి కయ్యాల మీరమ్మ(49) మృతి చెందిన సంఘటన వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మూర్తిరెడ్డిపాళెం గ్రామ సమీపంలోని మిట్టపాళెంలో నివాసం ఉంటున్న కయ్యాల దశయ్య, మీరమ్మ దంపతులు సమీపంలోని పొలాల వద్ద గేదెలు, గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో దశయ్య గేదెలను మేపడానికి ముందుగా వచ్చాడు. తరువాత భర్త వద్దకు వెళ్లే క్రమంలో మీరమ్మ స్వర్ణముఖి నది వద్ద ఉన్న నీటి గుంతలో దిగి కూరుకుపోయి చనిపోయింది. కనిపించకుండా పోయిన మీరమ్మ కోసం ఆమె భర్త దశయ్యతో పాటు కుటుంబ సభ్యులు వెతికారు. ఆమె స్వర్ణముఖి నది వద్దకు నడిచి వెళ్తున్నట్లు తెలుసుకుని నదిలో గాలించగా అక్కడి నీటి గుంతలో శవమై కనిపించింది. కుటుంబసభ్యులకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

తడ : మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడుకు చెందిన వెకటేశన్(47) మృతి చెందాడు. ఎస్‌ఐ నరసింహారావు సమాచారం మేరకు.. తమిళనాడులోని పుదవలూరు గ్రామానికి చెందిన వెంకటేశన్ రామాపూరం పంచాయతీ వెంకటాద్రిపాళెంలో ఉన్న తన బంధువుల ఇంటి నుంచి తిరుగు ప్రయాణంలో రాత్రి రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి గూడూరు వైపు వెళ్తున్న అతన్ని కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు అతని బంధువులకు సమాచారం అందించి కేసు నమోదు చేశారు.

హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

చంద్రగిరి: ప్రజలతో దురుసుగా ప్రవర్తించిన చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం నాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జి.రాజశేఖర్–1754 అనే కానిస్టేబుల్ తన విధులకు ఆటంక పరిచారని ముగ్గురు యువకులపై మంగళవారం రాత్రి చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సదరు యువకులను స్టేషన్‌కు తరలించే క్రమంలో అక్కడే విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం నాయుడు (PC No-.723) జయప్రకాష్ అనే యువకుడిపై దురుసుగా ప్రవర్తించాడు. దానికితోడు ఆ యువకున్ని కొట్టుకుంటూ స్టేషన్‌కు తరలించే వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపిన జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ సదరు హెడ్ కానిస్టేబుల్ ఎం.పురుషోత్తం నాయుడు దురుసుగా ప్రవర్తించాడని నిరూపణ అయింది. దీంతో అతన్ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.